# అల్లుడికి కట్నం-తండ్రి స్ట్రైక




డి.వి. నరసరాజు

అనగా అనగా ఒక వూళ్ళో ఒక రాజుగారు! ఆ రాజుగారికి ఒక కూతురు!

ఆ కూతురికి యుక్త వయస్సు వచ్చింది గనక- పెళ్ళి చెయ్యాలి!

పెళ్ళి చెయ్యాలంటే వరుడు కావాలి।

వెతగ్గా, వెతగ్గా – యింకో ఊళ్ళో యింకో రాజుగారు?

ఆ రాజుగారికి ఒక కొడుకు। ఆ కొడుకు పెద్దవాడై – అడ్డగారులు తొక్కకూడదు గనక – పెళ్ళి చేయాలి।

పెళ్ళి చేయాలంటే వధువు కావాలి।

ఆ రాజుగారి కూతుర్ని ఈ రాజుగారి కొడుక్కియిచ్చి పెళ్ళి చేయాలని నిశ్చయించుకున్నారు.

అన్నీ బాగానే వున్నాయ్‌గాని. కట్నం దగ్గరే కాస్త చిక్కు వచ్చింది.

మంగళసూత్రం కట్టినా, కట్టకపోయినా ఫరవాలేదుగాని కట్నంలేని పెళ్ళి పెళ్ళి కింద లెక్కకాదు.

ఆ మధ్య ఒక శ్రీమంతుల కొడుకు ఆదర్శాలకు పోయి, కట్నంలేకుండా పెళ్ళి చేసుకోడానికి సిద్ధపడితే-

"అంత కలిగిన ఇంటి బిడ్డ- కట్నం లేకుండా చేసుకుంటా నన్నాడంటే– ఇందులో ఏదో తిరకాసు వుంది। ఎందుకయినా మంచిది-కుర్రవాణ్ణి మన ఫామిలీ డాక్టర్ చేత పరీక్షచేయించ" మన్నదట పెళ్ళికూతురు అమ్మమ్మ.

అందువల్ల– అవసరం వున్నా లేకపోయినా, కట్నం తీసుకొని తీరాలి। లేకపోతే – వాడు మగవాడు కాదు।

అయితే – "కట్నం ఏమివ్వాలి, ఎంత యివ్వాలి" అని- రాజు లిద్దరికీ మీమాంస వచ్చింది

అలనాడు భవానీ శంకరుడికి అంటు మామిడితోట కట్నంగా యిస్తే - వాడు దానిని కాస్తా చింతామణికి వ్రాసి యిచ్చేశాడు

యిప్పుడు తోటలు పొలాలు కట్నంగా యిస్తామంటే 'సీలింగులో పోతయ్। వద్దు' అంటున్నారు.

యిళ్ళు. వాకిళ్ళు యిస్తామంటే- "టాక్సులు కట్టలేక చస్తాం. అవీ వద్దం"టున్నారు.

'తెలుపు'లో అయితే- ఎక్కువగా యివ్వలేం- 'నలుపు'లో అయితే మీరు కోరినంత రొక్కం యిస్తాం-అంటే-

"యిప్పుడు మాకు వున్న 'నలుపే' మమ్మల్ని నలిపి నలిపి చంపుతోంది! యింకా 'నలుపు' మాకు వద్దు మొర్రో" అంటున్నారు పెళ్ళికొడుకుల తండ్రులు.

కాలాన్నిబట్టి కట్నాల రూపాలు కూడా మారుతున్నాయి!

ఈ మధ్య ఒక ఆడపిల్ల తండ్రి అన్నాడు- "నాకు అరడజను బ్రాందీషాపులున్నాయి. అందులో ఏది కావాలో- కోరుకో, కట్నంగా యిస్తా"నన్నాడు.

"మాకు ఇదివరకే మూడుజిల్లాల సారా డిపోలు వున్నయ్ నీ బ్రాందీ షాపులు నేనేం చేసుకోను" అన్నాడు పిల్లవాడి తండ్రి.

"సరి అయితే- కట్నంగా ఏం కావాలి?" అని అడిగితే-

"మా వాణ్ణి మంత్రిని చెయ్యి" అని అడిగాడు ఒక పిల్లవాడి తండ్రి.

"ఎంత అవుతుంది?" అని అడిగాడు పిల్ల తండ్రి.

"అది చెప్పడం కష్టం! సీజన్‌బట్టి వుంటుంది" అన్నాడు పిల్లవాడి తండ్రి.

"సుమారు?"

"పది లక్షలు!"

"నలుపా? తెలుపా?"

"కలగలుపు!!"

యిలా వుంటున్నాయ్- అల్లుళ్ళ కట్నాలు- ఆంధ్ర స్టైల్స్.

నేను చెప్పిన రాజుగారికి ఈ స్టైల్స్ ఏవీ నచ్చలేదు.

విసుగు పుట్టి "మరేం కావాలో మీరే చెప్పండి" అన్నాడు ఆడ రాజుగారు (ఆడపిల్ల తండ్రి).


"మా వాడితో ఒక సినిమా తీయించండి అని చిన్న కోరిక కోరాడు మగ రాజుగారు (మగపిల్లవాడి తండ్రి)

"ఎంతవుతుంది?" అన్నాడు ఆడ రాజుగారు.

"నాకు తెలీదు! మావాణ్ణి అడగాలి" అని- 'ఏరా?' అని కొడుకుని అడిగాడు మగ రాజుగారు.

"ఆ! ఎంతవుతుంది! మంచికథ అయితే, అందరూ కొత్త వాళ్ళతో తీస్తే అయిదారు లక్షలు! ప్రొడక్షన్ వ్యాల్యూస్ బాగా పెడితే- పది లక్షలు" అన్నాడు పెళ్ళికొడుకు

"ఓసి! యింతేగదా! సరే" అని



## డి. వి. నరసరాజు

ఒప్పేసుకున్నాడు ఆడరాజుగారు.

"అలా అగ్రిమెంటు ముందే రాసుకుంటే మంచిదిగదా" అని సలహా యిచ్చాడు ఒక పెద్దమనిషి మగరాజుగారికి.

అక్కరలేదన్నారు ధీమాగా మగరాజు.

"పెళ్ళి అయ్యాక నీ కొడుకుచేత సినిమా తీయించకపోతే?"

"అంతే సంగతులు. వాళ్ళమ్మాయి వాళ్ళ యింట్లోనే వుంటుంది" అన్నాడు మగరాజు మందహాసంతో.

ఏ ఎగ్రిమెంటూ లేకుండానే పెళ్ళి అయిపోయింది.

"తెలుపు" ఏ మాత్రం కలవని నికార్సయిన "నలుపు"తో టెక్నికలర్ రంగ రంగ వైభవంగా చేశారు ఆడరాజుగారు అమ్మాయి పెళ్ళి

మూడు నిద్రలకి మద్రాసు పంపారు నూతన వధూవరుల్ని.

హోటల్‌లో- ఎయిర్ కండిషన్ గదిలో మూడు రాత్రులూ నిద్రపోయి- మూడు పగళ్ళు మేలుకుని, సినిమా వివరాలన్నీ సేకరించి అత్తగారింటికి తిరిగి వచ్చాడు అల్లుడు సతీసమేతంగా

"ఏం అల్లుడూ? సినిమా ఆరాలు తీశావా?" అని అడిగాడు మామ.

"కథ ఎంత మంచిదయినా- అందరూ కొత్తవాళ్ళతో తీస్తే- ఎవరూ కొనరంట మామయ్యా

పిక్చరంతా మనమే తీసి- కనీసం ప్రింట్సు ఖర్చులు పెట్టుకుని. విడుదల చెయ్యమన్నా. డిస్ట్రిబ్యూటర్లు చెయ్యరట."

"పోనీ ఆ విడుదల ఏదేదో మనం చేస్తే?"

"మనకయితే థియేటర్లు దొరకవు. థియేటర్లన్నీ డిస్ట్రిబ్యూటర్ల చేతుల్లో వుంటయ్"

ఆడరాజుకి లోలోన కాస్త ఆనందంగానే వుంది అల్లుడు సినిమా ప్రయత్నం విరమించుకుంటాడని.

అయినా మర్యాదకి అడిగాడు- "మరి అయితే యిప్పుడు ఏం చేద్దాం?"

"పెద్ద స్టార్స్‌ని పెట్టి తీద్దాం!" అన్నాడు అల్లుడు.

"అదెంత అవుద్ది" అని అడిగాడు మామ.

"50 లక్షలు!"

మామనెత్తిన పిడుగు పడింది.

గుండె ఆగింది.

తెరిచిన నోరు తెరిచినట్టే వుంది. లోపలికి ఈగలు పోతున్నా నోరు మూత పడటం లేదు. అల్లుడు కంగారుపడి-

"50 లక్షలు మనం పెట్టక్కరలేదు మామయ్యా! ముందు ఆర్టిస్టులకి అయిదారు లక్షలు అడ్వాన్సులిచ్చి పేపర్లో అడ్వర్టయిజ్‌మెంట్ యిస్తే.

షూటింగు మొదలెట్టక ముందే 70 లక్షలకి అన్ని ఏరియాలూ "బైయ్యర్లు" ఎగరేసుకుపోతారు. సినిమా విడుదల కాకముందే మనకి 20 లక్షలు లాభం" అన్నాడు.

ఆగిన మామ గుండె మళ్ళీ ఆడింది.

తెరిచిన నోరు మూసుకొంది. (లోపల ఈగలు లోపలే)

సగం దూరం పోయిన ప్రాణం వచ్చినట్లు మళ్ళీ తిరిగి వచ్చింది.

మామా, అల్లుళ్ళు మద్రాసు వెళ్ళారు పెద్ద హోటల్లో మకాం పెట్టారు.

యిద్దరికీ సినిమా పరిశ్రమ కొత్తగనక పాతికేళ్ళ నుంచీ పరిశ్రమలో వుండి. పెద్ద పెద్ద నిర్మాతలకు 'హిట్' చిత్రాలను 'తీసి పెట్టిన' ప్రొడక్షన్ కంట్రోలర్ (పి. సి.)ని పట్టుకున్నారు.

"మాకు ఒక 'హిట్' పిక్చర్ తీసి పెట్టు" అని అడిగారు.

తీసి పెడతానన్నాడు -పి. సి.

టాప్ హీరో, హీరోయిన్‌లతో పాటు. 'టాప్' డైరెక్టర్‌ని కూడా పెడితే. అన్ని ఏరియాలు- ముహూర్తంనాటికే 'హాట్' కేక్స్‌గా అమ్ముడుపోతయ్యన్నాడు పి.సి.

'సరే' నన్నారు మామా. అల్లుళ్ళు.

టాప్ డైరెక్టర్ని బుక్ చేశారు.

ఒక పాత హిందీ పిక్చర్ తెలుగు రైట్స్ కొన్నారు.

హిందీ రైట్స్ కూడా కొనమన్నాడు పి.సి.

"ఎందుకు?" అన్నాడు నిర్మాత.

"మళ్ళీ హిందీలో తియ్యొచ్చు" అని సలహా యిచ్చాడు పి.సి.

హీరో, హీరోయిన్, డైరెక్టర్, నటీ నటులు యితర సాంకేతిక నిపుణులకీ పది లక్షలకు పైగా అడ్వాన్సులు (నలుపు-తెలుపులు కలిపి) యిచ్చి సినిమా ప్రారంభానికి ముహూర్తం పెట్టారు.

పేపర్లో అరపేజీ ప్రకటన యిచ్చారు.

అల్లుడు నిర్మాత । మామ 'సమర్పణ' ముహూర్తంనాడు- 'స్విచ్ ఆన్' ఒక మంత్రి. 'క్లాప్'కొట్టడానికి యింకో మంత్రి.

ఆ రోజే ఒక విషాద వార్త.

అదే హీరో, అదే హీరోయిన్, అదే డైరెక్టర్- కాంబినేషన్‌తో తీసిన ఒక భారీ చిత్రం ఆ రోజే విడుదలయింది.

బ్రహ్మాండమైన ఫ్లాప్ అని, 'ఆట మధ్యలో జనం లేచిపోతున్నారని వార్త.

నిర్మాతలు నోరు వెళ్ళబెడితే, దర్శకుడు ధైర్యం చెప్పాడు. "రెండోవారంలో 'పికప్' చేస్తుంది. నా అన్ని చిత్రాలు అంతే"నని.

ముహూర్తంనాడే అన్ని ఏరియాలూ కొనడానికి వచ్చిన "బైయ్యర్లు" మళ్ళీ వస్తాం అని తిరిగి వెళ్ళిపోయారు.

"మొదటి షెడ్యూలు పూర్తిచేద్దాం సాంగ్ పిక్చరైజేషన్‌లో నన్ను మించిన వాడు లేడు పాటలు మాత్రమే చూపించి, ఒక్క నెల రోజుల్లో అన్ని ఏరియాలూ అమ్మేద్దాం" అని సలహా యిచ్చాడు డైరెక్టర్.

మొదటి షెడ్యూలు పది రోజులు షూటింగ్ జరిగింది.

మరో విషాద వార్త. అదే హీరో, అదే హీరోయిన్ మరో చిత్రం విడుదల

ప్రింట్స్ ఖర్చులు కూడా రావడం కష్టం అని అధికార వార్త.

"రెండో షెడ్యూలు కూడా చేద్దాం" అని ఏదో చెప్పబోయాడు డైరెక్టర్.

"నావల్లకాదు" అని కూలబడి కాడి పారేశాడు మామగారు. "నన్ను యీడ్చి యీడ్చి తన్నినా దమ్మిడీ రాలదు" అని మొండికేశాడు.

"మీరు దమ్మిడీ తేనక్కరలేదు. ఫైనాన్స్ ఏర్పాటు చేస్తాను" అన్నాడు- పి.సి.

ఏర్పాటు చేశాడు. నెలకి నూటికి 5 రూపాయలు వడ్డీ.

మామ గుండె పగలబోయింది.

"నెల రోజుల్లో పిక్చర్ అయిపోతుంది గదా. వడ్డీ ఎంతవుతుంది గనక." అని సర్ది చెప్పాడు పి. సి.

షెడ్యూలు కూడా పూర్తిచేశారు. షూటింగు అయిపోయింది ఇక డబ్బింగ్, రికార్డింగ్.

బైయ్యర్ల కోసం చూస్తే- ఎవరూ ముందుకు రావడంలా.

ఒక వేళ- వెంటబడి అడిగినా, చాలా తక్కువకే అడుగుతున్నారు. ఆ రేట్లకు అమ్మితే అసలుకూడా పూడేట్టులేదు.

ఫైనాన్సియర్ – ఇవ్వవలసిన డబ్బు ఇచ్చాడు ఇక ఇవ్వను అన్నాడు

రోజు రోజుకీ, నెల నెలకీ- వడ్డీ పాపం పెరిగినట్టు పెరుగుతోంది.

డబ్బింగ్, రీరికార్డింగ్, ఆర్టిస్టులకీ, టెక్నీషియన్స్‌కీ బకాయిలు యివ్వాలి। డబ్బు కావాలి

"అల్లుడూ మీ నాన్నని అడుగు" అని సలహా యిచ్చాడు మామ అల్లుడికి

అల్లుడు తండ్రిని అడిగాడు

తండ్రి అన్ని లెక్కలూ చూశాడు పరిస్థితి పూర్తిగా అవగాహన చేసుకొన్నారు.

తను ప్రస్తుతం నాలుగు లక్షలు పెట్టి- పిక్చర్ పూర్తిచేయాలి.

ఆ తరువాత ఫైనాన్సియర్ డబ్బు తిరిగి యిచ్చేసి పిక్చర్ విడుదలచేయాలి

అంతా ఒక నెల రోజుల్లో అయిపోతుంది విడుదల అయిన రెండు నెలల్లో తన డబ్బు తనకి తిరిగి వచ్చేస్తుంది.

ఈలోగా విడుదల నాటికే పిక్చర్ అమ్ముడుపోతే యింకా మంచిది

అన్నీ ఆలోచించుకొని అల్లుడి తండ్రి ఒక షరతు పెట్టాడు ముందు తన డబ్బు రాబట్టుకొన్న తరువాతనే వియ్యంకుడికి డబ్బు యిచ్చేది

తన డబ్బుకు 5 రూపాయల వడ్డీ కట్టాలి. లాభాలలో తనకు మూడు వంతులు, వియ్యంకుడికి ఒక వంతు

ఆడపిల్ల తండ్రి ఏం చేస్తాడు । అన్నిటికీ ఒప్పుకున్నాడు

మిగ రాజుగారు దగ్గరుండి డబ్బు మొత్తం తన సొంత చేతుల మీదుగా వాడి పిక్చర్ పూర్తి చేయించాడు

ఒక డిస్ట్రిబ్యూటర్‌ని బతిమాలి- 'ప్రింట్స్' ఖర్చు పెట్టుకుని విడుదల చేయమంటే- డిస్ట్రిబ్యూటర్ నసేమిరా వీల్లే'దన్నాడు.

చివరికి విధిలేక ప్రింట్స్, పబ్లిసిటీలకు మరొక 5 లక్షలు ఖర్చుపెట్టి పిక్చర్ విడుదల చేశారు

అదృష్టవశాత్తు పిక్చర్ విడుదల రోజే ఆంధ్రదేశంలో పెద్ద గాలివాన, తుఫాన్.

పిక్చర్ 'ఫ్లాప్' అన్నారు.

"గాలివాన వచ్చి దెబ్బకొట్టింది. రెండో వారం నుంచి చూడండి" బ్రహ్మాండంగా పికప్ చేస్తుంది అన్నాడు దర్శకుడు.

"యిప్పుడే తదుపరి చిత్రం ఎనౌన్స్‌మెంట్ చేస్తే మంచిది" అని సలహా యిచ్చాడు పి.సి.

వియ్యంకులు ఒకరి మొఖాలు ఒకరు చూసుకొని యిద్దరూ అల్లుడివంక చూశారు.

"తప్పదు. పారేసుకున్న బూట్ వెతుక్కోవాలిగాని ఒకచోట పారేసుకొని, మరోచోట వెతుక్కుంటే పోయిన వస్తువు ఎలా దొరుకుతుంది" అని వేదాంతం చెప్పాడు అల్లుడు.

వియ్యంకు లిద్దరూ రుసరుసలాడుతూ చెరొక వైపెక్కి యెవరి యిళ్ళకి వాళ్ళు వెళ్ళారు.

అల్లుడుమాత్రం "మళ్ళీ పిక్చర్ తీసి, హిట్ చేసేవరకూ యింటిముఖం చూడనని" శపథంచేసి, పెళ్ళాన్ని తీసుకువచ్చి మద్రాసులో కాపురం పెట్టాడు.

